


*[నాకు దేముడంటే అతి యిష్టం, మహాకోపం. అందుకే ఈ కథ ఇలా రాయడం జరిగింది. ఇందులో చాలా పొరపాట్లూ, ఎన్నో లోటుపాట్లూ ఉండొచ్చు. అందువల్ల నాకు పాపం చుట్టుకోవచ్చుగాని భగవంతుడికి ఏ లోటూ కలగదు. ఏ నష్టం ఉండదు. దీనికి 'కాశీదేముడి కథ' అని పేరు పెడదాం అనుకున్నాను. చివరికి హారతి పళ్లానికి నప్పించేను. — రచయిత]*

శారదకి ఈ మధ్యే ఆయిదేళ్ళు నిండాయి. పుల్లల్తో పిల్లని చేసి చర్మం తొడిగినట్లుగా ఆమె అర్భకంగా అతి బలహీనంగా కనిపిస్తుంది. ఆమె కళ్ళల్లో ఏదో ఆవేదన సన్నని దీపాలుగా వెలిగుంటుంది.

వినాయకచవితినాడు దేముడి కెదురుగా మఠం వేసుక్కూర్చుని, చేతులు జోడించి, కళ్ళు మూసుకుంది శారద. వంటిమీద చొక్కా లేదు. చిన్న మాసిన చెడ్డీ మాత్రం తొడుక్కుంది. తడిజుట్టు పొట్టిగా వేళాడుతోంది. ఎమికలన్నీ అతిస్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఉదయం తొమ్మిది గంట లయింది. త్వరలో కురవడానికి సిద్ధంగా మబ్బు లన్నీ ఒకదాని కొకటి చేరి సరంజామా అంతా కూడగట్టుకొని హడావిడేమీ చేయకుండా చాపకింద నీరులా తయా రవుతున్నాయి. నిమిష నిమిషానికీ కొద్దికొద్దిగా చీకటి ఎక్కు వవుతోంది.

గదంతా చీకటిగా గజిబిజిగా ఉంది. ఓ వార చాపమీద శారద తల్లీ, శారదా, ఎనిమి దేళ్ళ అన్నా పడుకు న్నున్నారు. మరో వార ఓ చల్లారిన కుంప టుంది. ఆ పక్కనే నుసిగా మారిన బొగ్గు లున్నాయి. వాటికి దగ్గరగా ఖాళీగా అవరించుకొని పక్కకి తిరిగి పడుక్కున్న 'సిల్వరు గిన్నె' చాలా మసిమసిగా ఉంది. గది కప్పున బూజు లున్నాయి. గోడల్నా మరకలూ గతుకులూ ఉన్నాయి. తారు పూసుకున్న గుమ్మాలు దయ్యపుగుమ్మాల్లా వికృతంగా ఉన్నాయి. గోడవారల్నా చెద లున్నాయి. మాసిన బట్టల్నిండా చిరుగు లున్నాయి. గదినిండా వాసన వాసన దుర్వాస నుంది.

కళ్లు మూసుకొనీ, మధ్య మధ్య కళ్ళు తెరస్తూనూ శారద తనలో ఏమేమో అనుకొంటోంది.

రాచకొండ విశ్వనాథశాస్త్రి

"...అమ్మ నన్ను కాణీదేవుడు కొనుక్కోమంది. అందుకే నిన్ను కాణీపెట్టి కొన్నాను. కిలుంకాణీ మంచిదట. డిబ్బీలో ఉంటే డబ్బు లొస్తాయిట. అమ్మా! ఒక్క కాణీవే ఉందే అన్నాను. పరవాలేదే సేరదా దేవుడు కొనుక్కోవే పూచ్చేసుకోవే అందమ్మ. అబ్బ బజారంతా ఎన్ని దేవుళ్ళో! కాణీ ఇస్తే కొట్టబ్బాయి బుచ్చి ఎర్రమన్ను దేవుడిచ్చేడు. అక్కడ మంచి మంచి పెద్ద పెద్ద దేవుళ్ళు ఎంతో మందిరి దేవుళ్ళు. మాలష్మి బేడదేవుడు కొన్నాదిట: దానికి బడాయి తెల్సా దేవుడూ? సెంకర్రావు ఎండిపావలా పెట్టి ముచ్చిరేకు దేవుడు కొనుక్కున్నాడు. రూపాయిస్తే రంగురంగుల రతం దేవుడిస్తార్ట! అబ్బ రతం మీద నిన్ను చూస్తే ముద్దేసిం దేవుడూ! అంత మంచిదేవుడు ఒచ్చీయేడు కొందావేఁ సేరదా అందమ్మ. మా అమ్మ ఎంతో మంచిద్దేవుడూ! అన్నకూడా మంచిదే. నువ్వూ మంచిదే. సెంకర్రావు నిన్ను ఎక్కిరించలేదు. మాలష్మి నిన్ను ఎక్కిరించిం తెల్సా? సేర ద్దేవుడు కాణీదేవుడు కాణీదేవుడు ఎక్కిరించింది. నాక్కోపం వేసింది. కోపం వేస్తే నా కేడు పేస్తుం దేవుడూ! మరేమొచ్చి అమ్మేంటం దంటే అందరు దేవుళ్ళూ ఒక్కటేనే సేరదా, ఏడవకే సేరదా అం దమ్మ. మాత్తరం రతందేవుడికి రూపా యెందుకు దేవుడూ? నాతో మాటాడవా దేవుడూ? మాలష్మికి నువ్వంటే కాణీదేవుడంటే కోపం. నాక్కోపం లేదు. నువ్వంటే నాకెంతో ఇష్టం. సెట్టికొట్టంత ఇష్టం. సినీమా అంత ఇష్టం. ఆకాసెంవం తిష్టం. ఎంతో యిష్టం. ఇందాకా నీతో ఎంతో సేపు మాటాడితే నువ్వు మాత్తరం నాతో మాటాడవు. నాతో ఒక్కసారి మాటాడవా దేవుడూ? నీక్కోపం వేసిందా? నీక్కోపం ఏస్తే నాకు బయంవేస్తుంది. అమ్మకి జొరం. అన్నకి జొరం. నీక్కోపం ఏసిందా దేవుడూ? అమ్మా అన్నా చచ్చిపోకు దేవుడూ! అల్లావేళ మా నాన్న చచ్చిపోయేడు. మాలష్మి చెప్పింది. మీ నాన్న దేవుడిదెగ్గర కెళ్ళలేదూ చచ్చిపోయేడూ మా లష్మి చెప్పింది. నా కేడుపేసింది. నాన్నకల్లవేళ జొరం. నాన్న మీసాలు నాక్కితకిత లేసేవి. నాన్న ఎంతో మంచినాన్న! నాన్న చూడాలి దేవుడూ! ఒక్కసారి నాన్న చూపించవా దేవుడూ? అప్పుడెప్పుడో అల్లావాళ చూసేనంతే. మళ్ళీ చూణ్నేలేదు. ఆవాళ నాకెంతో బయం ఏసిం దేవుడూ! ఆవాళ ఎంతో పేద్దవాన. యీధిలో మంచి మంచి బుంగలు. ఎన్నో బుంగ లొచ్చియి, బుంగలు బద్దలైపోయేయి. నేనూ అన్నా చూసేం. అప్పుడు నాన్న పిల్చేడు. అమ్మా నేనూ అన్నా దగ్గిరికి రమ్మన్నాడు నాన్న. మేఁ వెత్తే నాన్న ఏడ్చేడు. చూస్తూ ఏడ్చేడు. తరవాత మానీసేడు. నాన్న దగ్గడం లేదమ్మా, నాన్న జొరం పోయిం దమ్మా అన్నాను. అమ్మ నాన్న మీ త్తలపెట్టి గట్టిగా ఏడ్చింది. నాకు బయం ఏసింది. అమ్మా అన్నా నేనూ అందరూ ఏడ్చేం. అప్పు డెవరో ఒచ్చేర్దేవుడూ! ఒచ్చి కర్రమీద నాన్న పట్టుకుపోయేరు. నాన్న మీద వాన పడ్డాది. నాన్న తడిసిపోయేడు. నాన్నకి చలేసింది. నాన్న మాతో ఏం చెప్పకుండా ఎళిపోయేడు. పడుకుని మాటాడకండా ఎళిపోయేడు. వాన్లో చలేస్తూ ఎళిపోయేడు. అమ్మ చెప్పిందీ సేరదా నాన్న దేవుడింటి కెళ్ళేడే సేరదా అందమ్మ. ఓసారి నాన్న పమ్మింవవా దేవుడూ? పోన్లే దేవుడూ! మరైతే నీ జట్టుండ న్దేవుడూ! ... పోనీ ఒద్దులే. నీ జట్టుంటా న్దేవుడూ! మాత్తరం అమ్మా అన్నా మీ ఇంటికి తీసుకోవొద్దు దేవుడూ! నాన్న అమ్మ అన్న మీ యింటికి తీసుకుంటే నా కేడుపేస్తుంది. మా లష్మి కొడుతుంది. నాకు బయం ఏస్తుంది. నా కాక లేస్తుంది. నా కాకలేస్తూం దేవుడూ! నాకు ఏడన్నం తినాద్దేవుడూ! అబ్బ నా కాకలేస్తూంది. నా కాక లాక లాక లేస్తోం దేవుడూ! నాకు ఏగిరం మంచన్నం ఇయ్యవా దేవుడూ?, ఇస్తావా? మరి అమ్మకీ అన్నకో? అమ్మకీ అన్నకీ మందు కావాల్ట దేవుడూ! సీసా చూపిస్తే డాట్రు మందిస్తాట్ట, అమ్మ ఎళ్ళమంది. ఎల్తాను కాని నాకు ఆవులూ ఎద్దులూ మరే మొచ్చి పేద్దకుక్కలూ బస్తులూ చూపిస్తే బయం ఏస్తుంది దేవుడూ! నువ్వు మందియ్యవా దేవుడూ? పోనీ డాట్రుతో మందుతే చెప్పవా దేవుడూ! పోనీ అమ్మకీ అన్నకీ జొరం తీయిస్సీ దేవుడూ! అబ్బ నేను ఎళ్ళాల్నాకు బయం ఏస్తుం దేవుడూ! అబ్బా నా కాకలేస్తూంది, నాకన్నం పెట్టవా దేవుడూ?! బిళ్ళలూ బిసకత్తులూ మరే మొచ్చి లాడూలూ చేగోడీలూ మళ్ళీ ఇంకా బూరెలూ గార్లూ, ఇంకా ఇంకా ఇడ్డిలీలూ దోసెలూ పెరుగులూ అన్నీ నువ్వు తీసుకో! లేపోతే మాలష్మి లేపోతే సెంకర్రావుకీ ఇచ్చీ! నా క్కొంచెం మంచి ఏడన్నం పెట్టవా దేవుడూ?! నా కాకలేస్తోంది. నాకన్నం తినా ల్దేవుడూ! అన్నట్టేమో అమ్మ చెప్పిందీ అన్నంలో దేవుడున్నాడూ చెప్పింది. మరైతే నేను దేవుడు తిన్నమ్మా అంటే అమ్మందీ పరవాలేదే సేరదా. నీ కడుపులో కూడా దేవుడున్నాడూ అమ్మంటే తిన్నా న్దేవుడూ! నిజంగా నువ్వున్నావా నా లోపల: నిన్ను చూడా ల్దేవుడూ! మరేమొచ్చి మొన్న పగలుకి ముందురాత్తిరి అన్నయ్య చీమచూసి కొడితే, అమ్మ, తప్పురా చీమలో దేవుడున్నాడూ, కొట్టకూ అందమ్మ. అమ్మా నల్లిలో దేవుడుంటాడా అన్నయ్యంటే, ఉంటాడ్రా అందమ్మ. మరైతే తేల్లోనో? తేల్లోనూ పాములోనూ నువ్వుంటావుట అందమ్మ. తప్పుకదూ అలా ఉండొచ్చా దేవుడూ? అక్కడ నువ్వుండకు దేవుడూ! అవి నిన్ను కుట్టేస్తే నువ్వు చచ్చిపోతావు, తెలిసిందా? నువ్వు చచ్చిపోతే నా కేడుపేస్తుంది. అమ్మ చెప్పిందీ ఏడవకే సేరదా మనందరికీ దేవుడు దిక్కున్నాదే సేరదా, అమ్మ చెప్పింది. మరి నువ్వు చచ్చిపోతే మనందరికీ దిక్కెవరు దేవుడూ?! నువ్వు చచ్చిపోకు దేవుడూ! అమ్మా అన్నా చచ్చిపోకు! ఆకలెయ్యకు! అమ్మా అన్నా నాకూ

అందరికీ ఆకలెయ్యాకు! అమ్మా అన్నా మందియ్యి! జొరం తీసీ! అందరికీ ఆకలెయ్యాకు. అబ్బ ఆకలేస్తూంది. నా కాకలేస్తోం దేవుడూ. ఆక లాకలాక లాకలి, అబ్బా నా కాక లేస్తోం దేవుడూ..."

అంటూ ఏదేదో ఏవేవో అనుకొంటోంది శారద.

ఆ తరవాత కొంతసేపటికి శారద ఓ చిన్నసీసా పుచ్చుకొని వీథిలోకి బయల్దేరింది. "రోడ్డువారంట జాగ్రత్తగా నడుపమ్మా సేరదా!" అంది వాళ్ళమ్మ. అందుకే జాగ్రత్తగా నడుస్తోంది శారద. వర్షం ఇంకా పడలేదు. గాలి ఒక్కసారి రివ్వున వీచింది. దాన్తో రోడ్డుమీది దుమ్మంతా పొగలాగా పైకి లేచింది. పొగలో మనుషులూ కార్లూ బస్సులూ లారీలూ బళ్ళూ ఆవులూ ఎడ్లూ కుక్కలూ పందులూ అన్నింటితోనూ వీథంతా యమలోకంలో వీథిలా శారద కంటికి భయంకరంగా కనిపిస్తోంది.

శారదతల్లి మరో గంటసేపటికి తన వేడికళ్ళు బరువుగావిప్పి కొడుకుమీద చెయ్యివేసి చూసింది. కుర్రాడి వళ్ళు కాల్తోంది. ఆమెకి చాలా భయం వేసింది. తన వేడిచేతికే కుర్రవాడి వళ్ళు కాల్తూ తగుల్తోంది.

అమ్మో నాకు భయం వేస్తోంది. తండ్రీ పరాత్పరా ఎలా కాపాడతావో, నా కొడుకునెలా కాపాడతావో నువ్వే కాపాడాలి. మందులేదు. మాకులేదు. ఎవరూ సాయం లేరు. నేను లేవలేను. శారద చిన్నపిల్ల. నోర్లేనిపక్షి. అదేం చెయ్యగల్దు? పండుగపూటా అన్నంలేదు. ఆకలేస్తే అడలా పడుకుంటుంది కాని నాతో అయినా చెప్పదు. ఇంతసేపూ నీపూ చ్చేసింది. దానికి పట్టెడన్నం పెట్టలేకపోయేను. నే నేం తల్లిని? ఆకల్తో చుట్టుకుపోయే పిల్లని మందుకి తగిలేను. ఇంకా పిల్ల రాలేదు. రోడ్డునిండా కార్లు, బస్సులు; దానికి నువ్వే రక్ష. రక్షించు తండ్రీ, మమ్మల్ని రక్షించు. ఈ దీనుల్ని రక్షించు బాబూ రక్షించు!




శారదతల్లికి కళ్ళంట నీళ్లు రావు, ఆ వెప్పుతో కాగిపోయి ఆవిరైపోయిపోయేయి. ఏడిస్తే ఆమెకళ్ళు మంటల్తో మండినట్టు మండుతా యిప్పుడు.

ధర్మాసుపత్రికి ఫర్లాంగు దూరంలో రోడ్డుమధ్య ఓ లారీ ఆగింది. దానిచుట్టూ వలయాకారంగా జనం గుమిగూడి ఉన్నారు. లారీకి మరీదగ్గరకి రాకుండా పోలీసులు వార్ని వెనక్కి నెట్టుతూ ఉంచుతున్నారు. లారీకింద శారద పడుకునుంది. ఆమె తలమాత్రం బైటకి కనిపిస్తోంది. మిగతా శరీరం నెత్తుటిముద్దగా లారీకింద ఉంది. వర్షం కురుస్తూంది. అయినా జనం అలా వస్తూనే ఉన్నారు. పదిమంది గొడుగులు విప్పుకుంటే వెయ్యిమంది వర్షంలో తడుస్తున్నారు.

దూరంగా షాపుల చూరులకింద నిల్చున్న జనం ఏమేమో మాటాడుకొంటున్నారు.

...మృత్యు వెప్పుడొస్తుందో చెప్పలేం. లేకపోతే రోడ్డువారంట వెళ్తూన్న పిల్ల ఎవరో పిల్చినట్టు లారీకిందకి పరిగెట్టడం ఏమిటి చెప్పండి? చావు రమ్మంది. పిల్ల వెళ్ళింది. అంతే!...అది కాదండీ! అంతా బలే గమ్మత్తుగా జరిగింది. అమెరికన్ దొరసాన్ని స్కూటర్మీ త్తిప్పుతాడు

చూడండి!...అవునవును. ఆయిల్ కంపెనీ కుర్రాడు!...అవునుసార్, నే చూసేను... ఆడు స్కూటర్ తిన్నగా పట్టుకెళ్ళి ఆబోతుకెట్టేసేడు...స్కూటర్ కుర్రాడికి దెబ్బ తగిలేయా?...ఆబోతు జడుసుకు తోకెత్తి గెంతింది. దాన్తో పిల్ల గాబరైపోయి పరిగెట్టి పరిగెట్టి తిన్నగ లారీకింద కెళ్ళిపోయింది... మా మేస్త్రీటు డ్రైవర్ల మీద పులి...మరలాంటప్పుడు, ఏ డ్రైవరయినా ఏటిసెయ్యగల్డు సెప్పండి...ఎంత బ్రేకేసినా ముందుచక్రం అప్పటికప్పుడే పిల్లమీంచి వెళ్ళిపోయింది... స్కూటర్ కుర్రాడికి దెబ్బ తగిలేయండీ?... చూసేరా! నే చెప్పలేదూ? చావు రమ్మంది, పిల్ల వెళ్ళింది...అవున్సార్ మీ రెప్పింది రైట్! రాత రాసి ఉన్నప్పుడు తప్పించడం బ్రహ్మతరం కాదు... స్కూటర్ కుర్రాడేమయేడుసార్? దొరసానుందా?... ఇప్పుడా డ్రయివర్‌గాడు కేసు తప్పించుకుందికి ఏడుశెరువు ల్నీళ్ళు తాగాల!... మేస్త్రీటు కొడుక్కి సెయ్యిరిగిపోయిందిట బస్సుకిందపడి! ఆడు డ్రయివర్‌గాళ్ళ మీద పులి!...స్కూటర్ కుర్రాడికి దెబ్బతగల్లేదు కదుసార్?...దొరసాన్లేమ, నే చూసేను... అయినా తప్పంతా తలిదండ్రుల్దండీ మాస్టారూ! చిన్నపిల్లల్నలా వీధిలో విడిచి పెట్టడం ఎంత తప్పండీ?!... అసలు మన కంట్రీ మరింక బాపుపడదుసార్!... స్కూటర్ కుర్రాడికి దెబ్బ తగల్లేదుకదు సార్?... జెరుమనీవోడైతే జెబర్దస్తీగా ఏలగల్డు...జెపానోడు ఆడికి మొగుడు... అయినా భగద్విలాసం ఓలా ఉన్నప్పుడు మరోలా జరగదు. ఒంగో లేక్సిడెంట్లో మా పిన్ని కొడుకిలాగే సఫా అయిపోయేడు... స్కూటర్ కుర్రాడికి దెబ్బ తగిలే యేంటి సార్?...

శారద వెల్లకిలా పడుకునుంది. ఏ బాధలైనా తీర్చమనిగాని ఏ భయాలైనా పోగొట్టమనిగాని ఏ దేముణ్నయినా ప్రార్ధించవలసిన అవసరం ఆమె కిప్పుడు లేనేలేదు. ఆమె కిప్పుడు ఆకల్లేదు. అన్నం అక్కర్లేదు. నాన్న పోయినా ఒకటే, అమ్మ ఉన్నా ఒకటే. అన్నకి మందున్నా లేకపోయినా ఒకటే. ఆమె చాలా నిశ్చింతగా ఉండొచ్చు. కాని, చావులోకూడా ఆమె ముఖంమీంచి బాధలఛాయమాత్రం పోలేదు. యుగ యుగాల ముద్ర ముఖంమీద అలా ఉండిపోయింది. విచ్చిన ప్రమదల్లోంచి నూనె చిమ్మినట్టుగా ఆమె కళ్ళంట చిమ్మే రక్తం వాననీటితో కలిసి రోడ్డు మురికిలోకి జారుతోంది. అది ఏ సైడు కాలవలోకో పోతుంది. లేకపోతే రేపటి ఎండకి ఎండిపోయి దుమ్మూధూళిగా గాలి కెగిరిపోతుంది.

హడావిడిగా ముందు కొచ్చి లారీకింద దృశ్యాన్ని కళ్ళారా చూసినవారు ఒకక్షణం అలావుండి నిశ్శబ్దంగా వెనక్కి పోతున్నారు.

శార దింకా రాలేదు. శార దింకారాలే దను కొంటోన్న శారదతల్లికి మగతగా నిద్ర వస్తోంది. ఆమెకి తన గతజీవితం అంతా కలలు కలలుగా కనిపించి కదలిపోతోంది. ఈ పీడకల లెప్పుడు పోతాయి? ఈ మబ్బులన్నీ ఎప్పుడు విడతాయి? ఈ పాతాళంలోంచి పైకి మెట్లెక్కడున్నాయి? నిర్మలాకాశం, చల్లగాలీ, కమ్మని బతుకూ ఎక్కడ. ఎప్పుడు, ఏ చీకటితెరలు, ఏ అంధకారం, ఏ ఇనపతలుపుల అవతల??

శార తల్లికి కళ్ళుతెరిచి చూసేశక్తి లేకపోతోంది. చాలు మరింక కళ్ళుమూసుకు పడుకో; కన్నవారింటికి వెళ్ళిపో అంటూ చెవిలో ఎవరో పోరుతూన్నట్టనిపించిందామెకి.

గదంతా నిశ్శబ్దంగా ఉంది. చాపమీది ఆకారాలు కదలకుండా చాపమీదే ఉన్నాయి. ఆరిపోయిన కుంపటి చల్లారిపోయే ఉంది. బొగ్గులు నుసినుసిగానే ఉన్నాయి. ఖాళీ సిల్వరుగిన్నె మసిగానే ఖాళీగానే పడిపోయే ఉంది. కప్పున బూజులు భద్రంగానే ఉన్నాయి. గోడలు పొడిపొడిగా రాల్తూనే ఉన్నాయి. ఎంత తారు పూసినా, తలుపుల్ని చెదలు తినేస్తూనే ఉన్నాయి. బట్టలు మురిగ్గా చింకులుచింకుల్తో జీర్ణించిపోయే ఉన్నాయి. గదినిండా నిండుకున్న దుర్వాసన దుర్వాసన్లాగే ఉంది. సర్వజ్ఞుడూ సర్వలోకపాలకుడూ సకలబల సంపన్నుడూ కరుణాసముద్రుడూ దీనజన బాంధవుడూ అయిన భగవంతుడు విఘ్నేశ్వరరూపంలో అక్కడ శారద వేసిన పీటమీద, శారద వేసిన పూలమధ్య నిశ్చలంగా నిశ్శబ్దంగా గంభీరంగా, తవ్వితీసినమున్నగా, మనిషి చేసిన మనోహరమైన బొమ్మగా, కదలకుండా అలా కూర్చొనే ఉన్నాడు. అతని ముందున్న పచ్చిప్రమిద విచ్చిపోయింది. అందులోని దీపం ఆరిపోయింది